నమస్తే తెలంగాణ

# మెదక్

I | హైదరాబాద్, సోమవారం 19 ఆగస్టు 2024 | MEDAK

## ఉయ్యాలను వదలరా...



సిద్దిపేట జిల్లాకేంద్రం దవాఖానలో తల్లిఒడి ఉయ్యాలను చిన్నారుల అవసరార్థం ఏర్పాటు చేయగా, దవాఖాన సిబ్బంది దానిని లంచ్‌బాక్స్‌లతో నింపేస్తున్నారు. దీంతో దవాఖానకు శిశువులతో వస్తున్న వారికి అది ఉపయోగపడటం లేదు.

-నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫొటోగ్రాఫర్ సిద్దిపేట, ఆగస్టు 18

# ఊరించి.. ఉసూరుమనిపించి..!

- రూ.2 లక్షల రుణమాఫీ ఉట్టిదే
- మూడో విడతలోనూ సంగారెడ్డి జిల్లా రైతులకు మొండిచెయ్యి
- రుణమాఫీ అమలుపై రైతుల్లో ఆగ్రహం
- జిల్లాలో రుణమాఫీ కాలేదంటూ 4348 మంది రైతుల ఫిర్యాదు
- జుల్కల్‌లో ఒక్కరికీ రూ.2 లక్షల రుణమాఫీ కాలేదు



సంగారెడ్డి, ఆగస్టు 18(నమస్తే తెలంగాణ) : పంట రుణమాఫీ తీరుపై రైతుల్లో ఆగ్రహావేశాలు పెల్లుబికుతున్నాయి. సంగారెడ్డి జిల్లాలో సగం మంది రైతులకు పంటరుణం మాఫీ కాలేదు. ప్రభుత్వ గణాంకాలు సైతం దీనిని చెబుతున్నాయి. కేసీఆర్ హయాంలో 2018లో బీఆర్‌ఎస్ సర్కారు లక్ష రూపాయల పంట రుణం మాఫీ చేసింది. సంగారెడ్డి జిల్లాలో 1.13 లక్షల మంది రైతులకు రూ.678 కోట్ల పంటరుణాలు మాఫీ అయ్యాయి. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.2 లక్షల వరకు పంటరుణాలు ఏకకాలంలో మాఫీ చేస్తామని మూడు విడతల్లో మాఫీ అమలు చేసింది. సంగారెడ్డి జిల్లాలో 97,710 మంది రైతులకు రూ.842 కోట్ల పంటరుణం మాఫీ చేసింది. రూ.2 లక్షల వరకు పంటరుణం మాఫీ చేసిన నేపథ్యంలో పంటరుణం మాఫీ కావాల్సిన రైతుల సంఖ్య 2018లో కంటే అధిక సంఖ్యలో ఉండాలి. 2018 కంటే తక్కువ సంఖ్యలో రైతులకు పంటరుణం మాఫీ అయ్యింది. సంగారెడ్డి జిల్లాలో రూ.2లక్షల వరకు పంటరుణం తీసుకున్న రైతుల సంఖ్య 3.50 లక్షల వరకు ఉంటుందని అంచనా. ప్రభుత్వం 97,710 మందికి మాత్రమే రుణమాఫీ అమలు చేసింది. దీంతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా రైతులందరికీ రుణమాఫీ చేయలేదని, రేషన్ కార్డు, పీఎం కిసాన్ సమ్మాన్ నిబంధనల అమలుతో కొద్దిపాటి రైతులకు మాత్రమే అమలు చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ విషయంలో మోసం చేసిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**రుణమాఫీపై మంది 4348 ఫిర్యాదు..**

రుణమాఫీపై స్పష్టత లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రుణమాఫీకి అర్హులైనా తమపేరు జాబితాలో లేకపోవడంపై రైతులు తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారు. రుణమాఫీ ఎందుకు కాలేదో తెలుసుకునేందుకు బ్యాంకు అధికారులు, వ్యవసాయశాఖ అధికారుల చుట్టూరా ప్రదక్షిణలు చేస్తున్నారు. రుణమాఫీ కాలేదంటూ సంగారెడ్డి జిల్లాలో 4348 మంది రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేయని రైతుల ఇంకా వందల్లో ఉన్నారు. మూడో విడత రుణమాఫీ సమాచారం సైతం తెలియక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయశాఖ అధికారులు మూడో విడత రుణమాఫీ జాబితాను రైతులకు అందుబాటులో ఉంచలేదు. దీనికితోడు వ్యవసాయశాఖలో బదిలీలు చేపట్టారు. సంగారెడ్డి జిల్లాలోని సుమారు 26 మంది మండల వ్యవసాయశాఖ అధికారులు బదిలీ అయ్యారు. బదిలీల కారణంగా రుణమాఫీ సమాచారం, ఫిర్యాదుల విషయమై రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కంది మండలంలోని జుల్కల్ గ్రామ పంచాయతీలో 3వేల జనాభా, 2800 ఎకరాల వ్యవసాయభూమి ఉంది. 1000 మందికిపైగా రైతులు ఉండగా, 500 మందికిపైగా రైతులు కందిలోని ఎస్‌బీఐ, కోఆపరేటివ్ బ్యాంకుల్లో పంటరుణాలు తీసుకున్నారు. గ్రామంలో మొదటి విడతగా 158 మంది, రెండో విడతలో 72 మంది రైతులకు రుణమాఫీ అయ్యింది.మూడో విడతలో ఒక్కరికీ పంటరుణం మాఫీ కాలేదని గ్రామ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



# మూడో విడతలోనూ నిరాశే..!

- మెదక్ జిల్లాలో రూ.800 కోట్లకు.. రూ.631 కోట్లు మాఫీ
- మొదటి, రెండో విడత నగదు జమ కాలేదని రైతుల ఆందోళన
- అయోమయంగా మూడో విడత మాఫీ
- బ్యాంకులు, వ్యవసాయాధికారుల చుట్టూ ప్రదక్షిణలు

మెదక్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ) : మూడో విడత రుణమాఫీ జాబితాలో అర్హులైన చాలామంది రైతుల పేర్లు రాక పోవడంతో కర్షక లోకంలో ఆందోళన నెలకొంది. ఈనెల 15న సీఎం రేవంత్‌రెడ్డి మూడో విడత జాబితాను విడుదల చేయ గా, మెదక్ జిల్లాలో రుణమాఫీ సొమ్ము బ్యాంకుల్లో జమ కాలేదని పలువురు రైతులు చెబుతున్నారు. మొదటి, రెండో విడత రుణమాఫీ అమలు సమయం లో తలెత్తిన సమస్యలు, సాంకేతిక కారణలే మూడో విడత రుణమాఫీ సమయంలోనూ రైతులు ఎదుర్కొంటున్నారు. దీంతో ఏమి చేయలో తెలియక బ్యాంకులు, వ్యవసాయాధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. రుణమాఫీ డబ్బులను ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమచేస్తున్నామని చెబుతుండగా, ఆ డబ్బులు ఇంకా ఖాతాల్లో జమ కావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో రుణమాఫీ సరిగ్గా జరిగిందని, మాఫీ డబ్బులు వెంటనే తీసుకున్నామని రైతులు గుర్తు కేస్తున్నారు. రేషన్‌కార్డు లేదని, కుటుంబసభ్యుల నిర్ధారణ చేయాల్సి ఉందని, పాస్ పుస్తకాలు లేవని, ఆధార్ కార్డులో పేర్లు తప్పుగా ఉన్నాయని, బ్యాంక్ ఖాతాలో ఒక పేరు ఉంటే ఆధార్ కార్డు లో అందుకు సంబంధించిన అక్షరాలు తప్పుగా ఉన్నాయని, తీసుకున్న రుణం తక్కువగా ఉండగా వడ్డీ ఎక్కువగా ఉందని, ప్రభుత్వం ఉద్యోగం ఉందనే కారణాలతో రుణమాఫీ జరగడం లేదని తెలుస్తున్నది.

**రూ.800 కోట్లకు..... రూ.631 కోట్లు మాఫీ..**

2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు పంట రుణాలు తీసుకున్న రైతులందరికీ రుణ మాఫీ వర్తిస్తుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. మెదక్ జిల్లాలో 98,848 మంది రైతులు పంట రుణాలు తీసుకున్నారు. అధికారిక లెక్కల ప్రకారం 98,848 మంది రైతులు రూ.1,018 కోట్ల పంట రుణాలు తీసుకున్నారు. 88,648 మంది రైతులకు సుమారు రూ.800 కోట్ల పైచిలుకు రుణాలు పొందిన వారు ఉంటారని, వారికి ఈ రుణమాఫీ వర్తిస్తుందని అధికారులు చెబుతున్నారు. మొదటి విడతలో 51,492 మంది రైతులకు రూ.257.60 కోట్లు మాఫీ కాగా, రెండో విడతలో 22,850 మంది రైతులకు రూ.216.15 కోట్లు మాఫీ అయ్యింది. ఈ రెండు విడతలు కలిపి 74,342 మందికి రూ.473.76 కోట్లు మాఫీ అయ్యాయి. ఈనెల 15న ప్రకటించిన మూడో విడత మాఫీలో 12,306 మందికి రూ.157.25 కోట్లు మాఫీ అయ్యాయి. మొత్తంగా 84,648 మంది రైతులకు రూ.631.11 కోట్లు మాఫీ అయినట్టు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

# పోరాట యోధుడు సర్వాయి పాపన్నగౌడ్



సిద్దిపేటలో పాపన్నగౌడ్ జయంతి ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

- గౌడ కులస్తుల సంక్షేమానికి కృషిచేసిన కేసీఆర్
- కాంగ్రెస్ పాలనలో గౌడన్నలకు వేధింపులు
- పాపన్న జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్,ఆగస్టు 18 : సమ సమాజ నిర్మాణ స్థాపనకు పోరు సలిపిన గొప్ప పోరాట యోధుడు,17 శతాబ్దంలోనే బహుజన చక్రవర్తిగా కీర్తిగడించి చరిత్రలో పుట్టలో నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ మన అందిరికీ ఆదర్శమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు.జిల్లాకేంద్రం సిద్దిపేటలో ఆదివారం జరిగిన పాపన్నగౌడ్ 374వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి ఆయనను స్మరించుకున్నారు.అనంతరం మాట్లాడుతూ..సర్దార్ పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా పండుగలా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు.గౌడ్ సోదరులు పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తితో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారని, భవిష్యత్‌లోను ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని ఆకాంక్షించారు.అంతకు ముందు సలాం గౌడన్న పాటల సీడీని హరీశ్‌రావు ఆవిష్కరించారు. గౌడ సంఘం వారు నిర్వహించిన ర్యాలీ ని జెండా ఊపి ప్రారంభించారు. గౌడ్ కులస్తుల సంక్షేమానికి కేసీఆర్ ఎంతో కృషిచేశారన్నారు. గీత కార్మికులకు చెట్టు పన్ను రద్ద చేశారని, సొసైటీలను పునరుద్ధరించి గౌడ్ కులస్తులు వైన్స్‌ల్లో 15 శాతం రిజర్వేషన్లు కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. పెద్దఎత్తున ఈత వనాలను పెంచి వారికి ఉపాధి కల్పించారన్నారు. గీత కార్మికులు ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడితే రూ.6 లక్షల ప్రమాద బీమా కల్పించారని గుర్తుచేశారు. కేసీఆర్ పాలనలో కల్లు డిపోల మీద అక్రమ కేసులు, ఎక్సైజ్ శాఖ వేధింపులు లేకుండేవని, కాంగ్రెస్ ప్రభుత్వంలో గీత కార్మికులపై అక్రమ కేసులు నమోదు చేయించి వేధించడం, కల్లు డిపోల మీద దాడులు చేయిస్తూ గౌడ కులస్తులను తీవ్ర మనో వేదనకు గురిచేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. గీత కార్మికులను వేధించడం తక్షణమే ప్రభుత్వం మానుకోవాలని, వారి సంక్షేమానికి పాటుపడాలని హితవు పలికారు. మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, మారెడ్డి రవీందర్‌రెడ్డి,మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, పాల సాయిరాం, మరుపల్లి శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్ వినోద్ గౌడ్, గౌడ్ సంఘం నేతలు పల్లె కిషన్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



సిద్దిపేటలో విద్యార్థులను సత్కరిస్తున్న మాజీమంత్రి,ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

# విద్యపై పెట్టుబడితో బంగారు భవిష్యత్

- కేసీఆర్ పాలనలో ఓవర్సీస్ స్కాలర్‌షిప్ 20 లక్షలు అందించాం
- విద్యార్థులకు సొంత డబ్బులతో ఐప్యాడ్స్ అందిస్తున్నా
- విద్యార్థుల సన్మాన సభలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్,ఆగస్టు 18 : విద్యపై పెట్టుబడి భవిష్యత్ తరాలకు బంగారు బాటలు వేస్తుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ చాటిన ఎస్సీ విద్యార్థులను ఆదివారం నవజీవన్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో క్యాంప్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ..నవజీవన్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ వారు విద్యార్థులకు పురస్కారాలను అందించడం అభినందనీయం అన్నారు. మంచి కార్యక్రమాలకు తన సహాయం..ప్రోత్సహం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. పదో తరగతిలో 10/10 సాధించి విద్యార్థులు పది మందికి ఆదర్శంగా ఉండాలన్నారు.ఇదే స్ఫూర్తిని భవిష్యత్‌లోను కొనసాగించాలని కోరుకున్నారు. వెల్ఫేర్ సొసైటీ చేస్తున్న ప్రోత్సాహక కార్యక్రమాలు బాగున్నాయని, మంచి చేసే వారికి సహకారం అందిస్తానని, తన నెల వేతనం నుండి లక్ష రూపాయలు వెల్ఫేర్ సొసైటీకి అందిస్తానని హరీశ్‌రావు అన్నారు. ఏటా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తన సొంత డబ్బులతో ఐప్యాడ్‌లను అందిస్తున్నానని, ఈ ఏడాది 75మందికి అందించినట్లు తెలిపారు. కేసీఆర్ పాలనలో విద్యకు ప్రథమ స్థానం కల్పించారన్నారు.అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలరిషిప్ ద్వారా పేద విద్యార్థుల విదేశీ చదవులకు రూ.20 లక్షల చొప్పున అందించారని గుర్తుచేశారు.అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులను హరీశ్‌రావు సన్మానించారు.ప్రథమ, ద్వితీయ స్థానం పొందిన విద్యార్థులు నగదు పురస్కారాలు అందించారు.కార్యక్రమంలో సొసైటీ నిర్వాహకుడు కనకయ్య, బాలరాజ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# దవాఖాన ఏర్పాటు అభినందనీయం

- వైద్య ఆరోగ్య, సైన్స్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- పంచవటీ క్షేత్ర పీఠాధిపతి కాశీనాథ్‌బాబా మల్టీ స్పెషాలటీ దవాఖాన ప్రారంభం



రాఘవపూర్ దవాఖానను ప్రారంభిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

న్యాల్‌కల్, ఆగస్టు 18 : వివిధ రోగాలతో వైద్యం కోసం దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించి మంచిపేరును తీసుకువచ్చేలా కృషి చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య, సైన్స్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పిలుపునిచ్చారు. మండలంలోని రాఘవపూర్ గ్రామ శివారులోని సిద్ధి సరస్వతీ దేవి పంచవటీ క్షేత్ర ఆవరణలో రూ. 8 కోట్లతో 75 పడకలతో నిర్మించిన కాశీనాథ్‌బాబా మల్టీ స్పెషాలటీ దవాఖానను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంత ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో వైద్యం కోసం జహీరాబాద్, బీదర్, నారాయణఖేడ్ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, పంచవటీ క్షేత్ర పీఠాధిపతి కాశీనాథ్ బాబా ఆధ్వర్యంలో మల్టీ స్పెషాలటీ దవాఖాన ఏర్పాటు చేయడంతో ఆ ఇబ్బందులు దూరం కానున్నాయని తెలిపారు. ఈ దవాఖానకు అంబులెన్స్ మంజూరు చేస్తామని, పారామెడికల్, నర్సింగ్ కాలేజీలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. నారాయణఖేడ్-జహీరాబాద్ రూట్‌లో రాత్రి 9 గంటలకు బస్సును నడిపించేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని దృష్టికి తీసుకురాగా, సంబంధిత అధికారులతో మాట్లాడి బస్సును నడిపించేలా చూస్తామన్నారు. అనంతరం క్షేత్రంలో మంత్రి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు.నారాయణఖేడ్ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు సంజీవ్‌రెడ్డి, విజయ్‌పాల్‌రెడ్డి, నాయకులు ఉజ్వల్‌రెడ్డి, తన్వీర్, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, పంచవటీ క్షేత్ర పీఠాధిపతి కాశీనాథ్‌బాబా తదితరులు పాల్గొన్నారు.

## పంట రుణమాఫీ కాలే



హుస్నాబాద్‌టౌన్, ఆగస్టు 18: మాకు ఐదు ఎకరాల వరకు ఎవుసం ఉన్నది. ఎవుసంకోసం నాపేరు మీద రూ.70 వేలు, మా భార్య ఇందిర పేరు మీద లక్షా 30వేలు అప్పుతీసుకున్నా. నిన్న వచ్చిన జాబితాలో పంటరుణమాఫీ కాలేదు. నాలుగేండ్ల నుంచి ఎప్పటికప్పుడు తీసుకున్న అప్పుకు వడ్డీకూడా కడుతున్నా. కాంగ్రెస్ సర్కారు రెండు లక్షల రూపాయలు మాఫీ చేస్తమని చెప్పింది కదా. గింతమంచిగ మిత్తికట్టినంక కూడా మాకు ఎందుకు మాఫీ కాలేదో అర్థంకావడం లేదు.

-కన్నవేని రమేశ్, రైతు, హుస్నాబాద్, సిద్దిపేట జిల్లా

## రెండు వేలు కడితే మాఫీ వస్తదంట..



మెదక్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ) : నేను మెదక్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఏడీబీ) బ్యాంక్‌లో 2022లో రూ. 2 లక్షల క్రాప్ లోన్ తీసుకున్నా. ఒకసారి రెన్యువల్ చేయించిన. మళ్లీ రెన్యువల్ చేయాలని బ్యాంక్ అధికారులు చెప్పలేదు. మూడో విడతలో రుణమాఫీ కాలే. ఈ విషయమై వ్యవసాయాధికారులను సంప్రదిస్తే మెదక్ కలెక్టరేట్ ఆఫీసులో ఫిర్యాదు చేయమన్నారు. అక్కడ ఫిర్యాదు చేశా.

-మల్లయ్య, రైతు, వాడి, హవేళీఘనపూర్ మండలం (మెదక్ జిల్లా)

## కుటుంబంలో ఒక్కరికీ రుణమాఫీ కాలేదు..



సంగారెడ్డి, ఆగస్టు 18(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పంట రుణం మాఫీ అవుతుందని ఎంతో సంబరపడ్డాను. రేవంత్ సర్కార్ రైతులందరికీ రుణమాఫీ చేయకపోవటం బాధిస్తున్నది. మా కుటుంబంలోని నాలుగు మంది రైతులం కంది ఎస్‌బీఐ బ్యాంకులో పంటరుణం తీసుకున్నాము.మాలో ఒక్కరికి కూడా ప్రభుత్వం రుణమాఫీ చేయలేదు. నేను ఒక్కడినే 2.7 ఎకరాల భూమిపై లక్ష పంటరుణం తీసుకున్నా. రేషన్‌కార్డు ఉంది అయినా ప్రభుత్వం నాకు పంట రుణమాఫీ చేయలేదు. పేదవాడినైన నాకు ప్రభుత్వం రుణమాఫీ చేయాలి.

-ముత్తంగి శ్రీను, రైతు, జుల్కల్ (సంగారెడ్డి జిల్లా)

## రుణమాఫీ 'కల'గానే మారింది



నిజాంపేట,ఆగస్టు18: ఏకకాలంలో రూ.2 లక్షల పంటరుణమాఫీ అంటూ గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటన కలగానే మారింది. నిజాంపేటలోని ఏపీజీవీబీలో రూ.90 వేలు పంట రుణం తీసుకున్నా.మిత్తితో కలిసి రూ.1,11,431 అయ్యాయి. ఐనా పంటరుణం మాఫీ కాలేదు. రైతుల సంక్షేమం కోసం పాటు పడుతున్నామని, రూ.2 లక్షల వరకు పంటరుణమాఫీ చేశామంటూ కాంగ్రెస్ నాయకులు చెబుతున్నవన్నీ మాయ మాటలే. ఇకనైనా రైతులకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలుపుకోవాలి.

-పన్యాల రాజశేఖర్‌రెడ్డి, రైతు, నిజాంపేట, మెదక్ జిల్లా

## చేయకుంటే ఉసురు తగులుతది



మిరుదొడ్డి, ఆగస్టు 18 : బ్యాంకులో రూ.60 వేల అప్పు తెచ్చుకున్నా. నేను ఇప్పటికే రూ. 50 వేలు చొప్పున రెండు సార్లు మిత్తి కట్టాను. ఇప్పుడు నాకు బ్యాంకులో రూ. లక్షా 20 వేలు అప్పు ఉన్నది. కానీ పంట రుణమాఫీ రాలేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పంట రుణ మాఫీ చేస్తవా..చేయవా చెప్పాలి. అసెంబ్లీ ఎన్నికల్లో చెప్పినట్లు చేయాలి లేకుంటే పేదోల ఉసురు తగులుతది.

- మైసయ్య, రైతు ఖాజీపూర్, ఉమ్మడి మిరుదొడ్డి మండలం, సిద్దిపేట జిల్లా

## మాఫీ కాలేదంటున్నారు



మిరుదొడ్డి, ఆగస్టు 18 : నాకు ఎకరంన్నర భూమి పై ఎలాంటి ఇబ్బందులు పెట్టకుండా బ్యాంకు అధికారులు రూ.85 వేల వరకు పంట రుణం ఇచ్చిండ్రు. ఇప్పుడేమో పంట రుణమాఫీ రాలేదు అంటూ చెబుతున్నారు. నా భార్య బీడీల ఫారంపై తోట రాంరెడ్డి అని నా పేరు ఉంది, పట్టా పాసు బుక్కులో తోటరాములు అని ఉన్నది. అప్పు ఇచ్చినప్పుడు లేని తప్పులను ఇప్పుడూ చూపిస్తూ పంట రుణమాఫీ రాలేదని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన విధంగా పంట రుణమాఫీ చేయాలి.

-తోట రాంరెడ్డి, రైతు, మిరుదొడ్డి, సిద్దిపేట జిల్లా

## మాట తప్పిన కాంగ్రెస్



నర్సాపూర్,ఆగస్టు 18: రెండు లక్షలలోపు పంట రుణమాఫీ చేస్తానని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి ఇప్పుడు మాట తప్పింది. 2023లో రూ.1,95,000 రుణానికి సంబంధించి రెన్యువల్ చేసుకున్నా. ఇప్పుడు వడ్డీతో కలిపి రూ.2,26,000 అయ్యింది. కానీ మూడో విడతలో రెండు లక్షల్లోపు పంటరుణమాఫీ చేస్తానన్న ప్రభుత్వం నాకు అన్యాయం చేసింది. మూడో జాబితాలో నా పేరు లేదు. ఇదేంటని అధికారులను అడిగితే తర్వాత వస్తదని అంటున్నారు. పంటరుణమాఫీ జరుగుతదని ఎంతో ఆశ పడ్డాకానీ నా ఆశలు అడిఆశలయ్యాయి. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పంటరుణమాఫీ చేసి న్యాయం చేయాలి.

- నీరుడి భిక్షపతి, రైతు,అచ్చంపేట్, మెదక్ జిల్లా

## రైతులను మోసం చేసిన కాంగ్రెస్



శివ్వంపేట, ఆగస్టు 18 : కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఒకలా... గెలిచిన తర్వాత మరోలా రైతులతో ఆడుకుంటున్నది. శివ్వంపేటలోని ఇండియన్ బ్యాంకులో రూ. లక్షా50వేల రుణం తీసుకోగా వడ్డీతో కలిసి ఇప్పుడు రూ. లక్షా58వేలు అయ్యింది. మూడో విడత పంటరుణమాఫీ జాబితాలో నా పేరులేదు. రెండు లక్షల పంటరుణమాఫీ చేస్తామని చెప్పి వరంగల్ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీచే అప్పటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రకటింపజేసి ఇప్పుడు మోసం చేశాడు. నాతో పాటు చాలా మంది రైతుల పరిస్థితి ఇలాగే ఉన్నది.

- వజ్జ రాజు, రైతు సంఘం జిల్లా నాయకుడు, శివ్వంపేట, మెదక్ జిల్లా

## మూడో విడతలో కూడా కాలేదు



శివ్వంపేట, ఆగస్టు 18 : శివ్వంపేటలోని కోఆపరేటివ్ బ్యాంకులో రూ. 60వేల పంటరుణం తీసుకున్నా. రెండో విడత పంట రుణమాఫీ జాబితాలో నా పేరు రాలేదు. అధికారులను అడిగి దరఖాస్తు పెట్టుకున్నా. మూడో విడత పంట రుణమాఫీ జాబితాలో పేరు వస్తుందని ఆశతో ఎదురుచూసినా రాలేదు. ఏంచేయాలో అర్థంకావడం లేదు. ప్రభుత్వం పట్టించుకొని పంట రుణమాఫీ అయ్యేలా చూడాలి.

-ఎంచర్ల మల్లేశ్,రైతు, తిమ్మాపూర్, శివ్వంపేట మండలం, మెదక్ జిల్లా

## ఇబ్బందులు పెట్టుడు బాగాలేదు



కొమురవెల్లి, ఆగస్టు 18 : కొమురవెల్లిలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకులో ఆరేండ్ల క్రితం లక్ష రుణం తెచ్చుకున్నా. ప్రతి సంవత్సరం రెన్యువల్ చేయించుకుంటున్నా. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2లక్షలు మాఫీ చేస్తామని చెప్పింది. పంటరుణమాఫీ జాబితాలోనూ పేరు రాలేదు. బ్యాంకుకు వెళ్తే అప్పు రూ.2లక్షల 5వేలు ఉంది, రూ. 5వేలు కట్టమన్నారు. దీంతో 5వేలు కడితే రూ.2లక్షలు మాఫీ వస్తదేమో అనుకున్నా. కానీ పేరు పైకి పంపుతామన్నారు. గిదేందో నాకు అర్థం కాలేదు. పంటరుణమాఫీ చేయాలి కానీ గిట్ల ఇబ్బందులు పెట్టుడు బాగాలేదు.

-బచ్చల రమణ, మహిళా రైతు, గురువన్నపేట, సిద్దిపేట జిల్లా

## పంట రుణమాఫీపై ఆశల్లేవ్



మునిపల్లి, ఆగస్టు 18: కాంగ్రెస్ ప్రభుత్వం పంట రుణమాఫీ మూడు విడతల్లో ఆగస్టు 15లోపు చేస్తామని చెప్పింది...మొదటి విడత నుంచి ఎదురు చూస్తున్నప్పటికీ నా పేరు పంటరుణమాఫీ జాబితాలో లేదు.పంటరుణమాఫీపై మాకు ఎలాంటి ఆశల్లేవ్.బ్యాంకు చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. బ్యాంకు, వ్యవసా యాధికారుల నిర్లక్ష్యం వల్ల నాకు పంటరుణమాఫీ కాలేదు.. నాతో పాటు చాలా మంది రైతులు పంటరుణమాఫీ కాక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకుని పంటరుణమాఫీ చేయాలి.

-అశోక్, బుసారెడ్డిపల్లి, రైతు, మునిపల్లి మండలం, సంగారెడ్డి జిల్లా